క్లుప్తంగా

సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలి

పాలసముద్రం: మండల పరిధిలోని గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని ఎంపీడీఓ క్రిష్ణమహేష్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన క్రిష్ణజమ్మ పురం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయానికి పలు సమస్యలతో వచ్చిన వారితో స్నేహ భావంతో మెలిగి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్య లోపం, దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రీన్‌అంబాసిడర్లు తాగునీటి ట్యాంకులను శుభ్రంగా చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం క్లోరినేషన్ రిజిస్టర్‌ని తరవుగా పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హఠాత్తుగా రోడ్డుపై పడ్డ చెట్టు

– ఒకరికి గాయం, దెబ్బతిన్న బైకు


చెట్టును తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నగరి: పట్టణ పరిధి తిరుపతి రోడ్డు యాక్సిస్ బ్యాంక్ సమీపం రోడ్డు పక్కనే ఉన్న చెట్టు గురువారం ఉదయం అకస్మాత్తుగా కింద పడింది. ఆ సమయంలో అటువైపుగా వస్తున్న బైక్‌పై చెట్టు పడడంతో రమేష్(62) అనే వ్యక్తి కాలికి గాయం కావడంతోపాటు ద్విచక్ర వాహనం దెబ్బతినింది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాయపడిన వ్యక్తిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. మున్సిపల్ అధికారులు చెట్టును అక్కడి నుంచి తొలగించడానికి శ్రమించాల్సి వచ్చింది.

మృతురాలికి నివాళి


షబీరా భాను పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న హరికృష్ణ

గంగాధరనెల్లూరు: వింజం గ్రామ పంచాయతీ ఆవలాపూర్ గ్రామంలోని మైనారిటీ నాయకుడు నూర్ బాషా సతీమణి, వైఎస్ఆర్ సీపీ నాయకుడు హిట్లర్ తల్లి షబీర భాను అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సీపీ నాయకుడు ఆనగంటి హరికృష్ణ గురువారం ఆవలాపూర్ గ్రామానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి భరోసా ఇచ్చారు. గ్రామ సర్పంచ్ రామక్క, ఎంపీటీసీ హనీఫ్ బాషా, మాజీ సర్పంచ్ గోవిందయ్య, నగేష్, కుట్టి, ఖాదర్ బాషా, భాను దేవా, వెంకటేశ్వర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఐరాల: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా జీవించవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నాగంవాండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వృద్ధులు, చిన్నారులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. సంప్రదాయ ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అంతిమ కష్టాలకు సెలవు



పట్టణ ప్రజలకు అంతిమ యాత్ర కష్టాలు ఇక ఉండవు. నగరి శ్మశాన వాటికలో గత ప్రభుత్వం రూ.1.09 కోట్ల వ్యయంతో సిద్ధం చేసిన అత్యాధునిక క్రిమేషన్ షెడ్డు, ఉత్తర క్రియల షెడ్డు, బాత్రూమ్‌లు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. దీంతో అంతిమ యాత్ర సమయంలో అయిన వాళ్లు పడే కష్టాలకు తెరపడింది.
– నగరి


కాశీవిశ్వేశ్వర వైకుంఠ ముక్తిధామం ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి రోజా (ఫైల్)

- నగరి శ్మశానంలో ఎల్‌పీజీ క్రిమేషన్ షెడ్డు సిద్ధం
- రూ.1.09 కోట్ల వ్యయంతో కాశీ విశ్వేశ్వర వైకుంఠ ముక్తిధామం
- ఎన్నికలకు ముందే ప్రారంభించిన మాజీ మంత్రి ఆర్కే రోజా
- ఎన్నికల కోడ్‌తో మూతపెట్టిన అధికారులు
- ప్రస్తుతం గ్యాస్ బిగించడంతో వాడకంలోకి
- అంతిమ యాత్ర కష్టాలకు దక్కిన పరిష్కారం

వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సయమంలో దహనక్రియలకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి అప్పటి రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా శ్మశాన వాటికలో అభివృద్ధికి ప్రత్యేక పథక రచన చేశారు. ప్రభుత్వం ద్వారా రూ.1.09 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఎల్పీజీ క్రిమేషన్ షెడ్డు, ఉత్తర క్రియల షెడ్డు, బాత్రూంలు, శ్మశానం లోపలికి వెళ్లడానికి రోడ్డు, ప్రవేశ మార్గంలో ఆర్చితో పాటు ఆధునిక శ్మశాన వాటికను సిద్ధం చేశారు. తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వైకుంఠ ముక్తిధామం ప్రవేశ మార్గంలో పది అడుగుల ఎత్తున్న కాశీవిశ్వేశ్వరుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని గత ఏడాది మార్చి 11వ తేదీన ఆవిష్కరించారు. అయితే ఎల్పీజీ గ్యాస్ బిగించి, వినియోగంలోకి తెచ్చేలోపు ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు అన్నింటికీ తాళాలు వేశారు. దీంతో అవి వినియోగంలోకి రాలేదు. ఎన్నికలు ముగిసిన అనంతరం ప్రభుత్వాలు మారడం, అధికారుల మార్పు చోటుచేసుకోవడంతో ఎల్పీజీ గ్యాస్ బిగించే పనులు జాప్యమవుతూ వచ్చాయి. ఇన్నాళ్లకు గ్యాస్ బిగించే పనులు పూర్తికావడంతో క్రిమేషన్ షెడ్డు అందుబాటులోకి వచ్చింది. ఇకపై పట్టణ ప్రజలు అతి తక్కువ ఖర్చుతో దహన క్రియలు నిర్వహించుకోవచ్చు.

ప్రజలకు భారీ ఉపశమనం

ప్రస్తుతం నగరి పట్టణంలో ఎవరైనా మృతి చెందితే వారి దహనక్రియలు చేయడం అతిపెద్ద సమస్యగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న జనం వర్షాలు వచ్చిన సమయంలో నీటి ప్రవాహం అడ్డుపడడంతో శ్మశాన వాటికకు వెళ్లలేకపోయేవారు. నగరి పట్టణంలో ఎల్‌పీజీ క్రిమేషన్ సౌకర్యం లేకపోవడంతో పుత్తూరుకు తీసుకెళ్లి దహనం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇదిగాక పట్టణ ప్రజలు ఎలాంటి హంగులు లేకుండా దహనం చేయడానికే మాత్రమే సుమారు రూ.20 వేలు ఖర్చవుతోంది. కాంట్రాక్టు పద్ధతిలో వీటిని చేస్తున్నారు. ఇకపై పట్టణ ప్రజలు ఇంత ఖర్చులు చేయాల్సిన అవసరం లేదు. రూ.4 వేలు మున్సిపాలిటీకి చెల్లిస్తే సరిపోతుంది. అతి తక్కువ ఖర్చుతో దహన క్రియలు చేసుకోవచ్చు


శ్మశానంలో ఉత్తరక్రియల మండపం, బాత్రూమ్‌లు


కొత్త ఆఫీస్ గది

డెత్ సర్టిఫికెట్ సులభతరం

ఇదివరలో మరణ ధ్రువీకరణ పత్రం (డెత్ సర్టిఫికెట్) తీసుకోవాలంటే దరఖాస్తు చేసుకునేవారి ఆధార్ కార్డు, మృతి చెందిన వారి ఆధార్ కార్డు నకలు జతచేసి మున్సిపల్ కార్యాలయంలో ఇవ్వాలి. సంబంధిత అధికారి మృతిని నివాస ప్రాంతానికి విచ్చేసి ఇరుగుపొరుగు వారిని విచారించి మరణాన్ని ధ్రువీకరించిన తరువాతే సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఇక ఇంత ప్రక్రియ అవసరం లేదు. మరణించిన వ్యక్తిని ఎల్‌పీజీ క్రిమేషన్ షెడ్డులో దహనం చేసిన తరువాత చితాభస్మంతోపాటు రశీదును మున్సిపల్ అధికారులు అందజేస్తారు. ఆ రశీదును మాత్రం చూపి దరఖాస్తు చేసుకుంటే డెత్ సర్టిఫికెట్ అందిస్తారు.

వినియోగంలోకి తెచ్చాం



ఎల్‌పీజీ గ్యాస్ క్రిమేషన్ షెడ్డును వినియోగంలోకి తెచ్చాం. అధికారులు క్రిమేషన్ యంత్రాల పనితీరును ట్రయల్ చేసి పరిశీలించాం. ఇకపై మృతదేహాలను శ్మశాన వాటికలోని క్రిమేషన్ షెడ్డులో దహనం చేసుకోవచ్చు. అందుకు అయ్యే ఖర్చులు కూడా రూ.4 వేలు మాత్రమే. ఇంతటి గొప్ప సదుపాయాన్ని కల్పించిన మాజీ మంత్రి ఆర్కే రోజాకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా.

– పీజీ నీలమేఘం,
మున్సిపల్ చైర్మన్, నగరి మున్సిపాలిటీ


శ్మశానంలో నిర్మించిన క్రిమేషన్ షెడ్డు

ఇంగ్లీష్ అధ్యాపకుడికి డాక్టరేట్


నాగేశ్వరరావు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావుకు కుప్పం ద్రవిడ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు గురువారం తెలిపారు. ప్రొఫెసర్ ఇ.దిలీప్ పర్యవేక్షణలో టోరెంట్స్ ఆఫ్ ఇంటరాగేషన్, ఏ క్రిటికల్ స్టడీ ఆఫ్ అరుంధతి రాయ్స్ సెలెక్ట్ నాన్ ఫిక్షన్ అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ప్రముఖ జర్నల్స్‌లో మూడు పరిశోధన వ్యాసాలను ప్రచురించినట్లు వెల్లడించారు. దీంతో డాక్టరేట్ అందించినట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద, అధ్యాపకులు నాగేశ్వరరావును అభినందించారు.

అప్పలాయగుంటలో వైకుంఠ ద్వారం



అప్పలాయగుంటకు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఆర్చి

వడమాలపేట (విజయపురం): అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వ దినం సందర్భంగా శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ శ్రీవాణి తెలిపారు. భక్తులకు ఎక్కువ సమయం ఉత్తర ద్వార దర్శనం కల్పించడం కోసం శుక్రవారం ఉదయం 12.05 గంటలకు నిత్య కైంకర్యాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తిరుప్పావై ప్రవచనాలతో ప్రారంభమై కొలువు, అర్చన, స్వామి అమ్మవార్లకు అభిషేకం అనంతరం ఉదయం 3.30 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభమవుతుందని చెప్పారు. ఉదయం 7.15 గంటల నుంచి 8 గంటల వరకు రెండో గంట, నివేదన, సాయంత్రం 4–5 గంటల మధ్య శ్రీవారి వాహన ఆస్థానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రి ఎనిమిది గంటల వరకు నిరంతరాయంగా సర్వదర్శనం కల్పిస్తున్నామని, రాత్రి తొమ్మిది గంటలకు ఏకాంత సేవ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

పుత్తూరు: కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ కె.రమేష్‌బాబు స్పష్టం చేశారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల స్థాయి శిక్షకుల కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు పెద్దలే పిల్లల సంరక్షణ చూసేవారని, ప్రస్తుతం పరిమిత కుటుంబాల కారణంగా పిల్లల సంరక్షణ కొరవడిందన్నారు. ఫలితంగా ఆరోగ్యంతోపాటు నేర ప్రవృత్తి ఎక్కువైందన్నారు. వీటి నుంచి పిల్లలను రక్షించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ వర్కర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లపై ఉందన్నారు. డ్రాపౌట్ విద్యార్థులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇదివరకే బడి మానేసిన 11 నుంచి 18 ఏళ్ల కిశోర బాలికలను గ్రూప్స్‌గా ఏర్పాటు చేసి స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పించాలని సూచించారు. ఏఎస్ఐ రవి మాట్లాడుతూ మాట్లాడుతూ యువత సైబర్ క్రైమ్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. బాలల అక్రమ రవాణాపై అప్రమత్తంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్, ఎంఈఓ తిరుమలరాజు, సీడీపీఓ సంధ్య, ఐసీడీఎస్ సూపవర్‌వైజర్లు గీతాంజలి, అనిత, రోజారమణి, మనీలా, ఏఎన్ఎంలు, ఎంఎస్‌కేలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

పుత్తూరు: ఇంటర్ సమయంలోనే విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకొని అందుకు తగ్గ కృషి చేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి సూచించారు. గురువారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉన్నత విద్యపై జూనియర్ కళాశాల విద్యార్థుల అవగాహన కల్పించడంతోపాటు సృజనాత్మకతను ప్రోత్సహించడమే ఓపెన్ డే ముఖ్య ఉద్దేశమన్నారు. డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, వాటి ప్రయోజనాలు వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఓపెన్ డే కార్యక్రమం ఇంటర్ విద్యార్థులకు ప్రేరణ ఇస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు కళాశాలలోని లేబోరేటరీ, కంప్యూటర్, గ్రంథాలయ సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో నాగలాపురం ప్రిన్సిపల్ శ్రీలత, అధ్యాపకులు కోటేశ్వరయ్య, వీరయ్య, నరసింహులు, సుజన, శ్రీనివాసులు, లోకనాథం, ధనుంజయ, గిరిప్రకాష్, సంగీత, నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, గోపాలకృష్ణాపురం జూనియర్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైకుంఠ ద్వార దర్శనం


కరియమాణిక్యస్వామి ఆలయంలో వైకుంఠ ద్వారం

నగరి: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని పట్టణ పరిధిలో టీటీడీ ఆధీనంలో ఉన్న కరియమాణిక్య స్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం కల్పించడానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. సాలువ రాజుల పాలనలో నిర్మించిన ఈ ఆలయం గజేంద్ర మోక్షానికి ప్రతీతి. ఆలయాన్ని టీటీడీ అధికారులు జీర్ణోద్ధరణ గావించి వైకుంఠ ద్వార దర్శనం కల్పించేలా ఆలయాన్ని నిర్మించారు. ఉత్సవాలను పురస్కరించుకొని టీటీడీ అధికారులు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయం లోపల, వైకుంఠ ద్వారంలో పుష్పాలంకరణలు చేశారు. తిరుమల ఆలయం తరువాత జిల్లాలో టీటీడీ ఆధీనంలో ఉన్న ఆలయాల్లో వైకుంఠద్వార దర్శనం నగరి ఆలయంలో మాత్రమే ఉండడంతో ఇది ప్రత్యేకతను సంతరించుకుంది. గురువారం వైకుంఠ ద్వారాన్ని శుభ్రపరచి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. శుక్రవారం ఉదయం 4 గంటల నుంచే అభిషేకాలు చేపట్టి, ప్రత్యేక అలంకరణ చేస్తామని 5 గంటల నుంచి దర్శనం కల్పిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

వైకుంఠనాథస్వామి ఆలయంలో...

మండలంలోని తెరణి వైకుంఠనాథస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించనున్నారు. 500 సంవత్సరాల క్రితం శ్రీకృష్ణదేవరాయల పాలనలో ఆలయాన్ని నిర్మించినట్లు స్థల పురాణం చెబుతోంది. వందేళ్ల క్రితం నుంచి బ్రాహ్మణ కుటుంబాలు ఆలయ పర్యవేక్షణ చేపడుతున్నాయి. లోక్‌సభ మాజీ స్పీకర్ అనంతశయనం అయ్యంగార్ సతీమణిది తెరణి స్వగ్రామం కావడంతో ఆయన గ్రామంలోని ఆలయ విశిష్టతను తెలుసుకొని తనవంతు సహకారం అందించారు. ఆలయ మాన్యం భూముల నుంచి వచ్చే స్వల్ప ఆదాయంతో ధూపదీప నైవేద్యం పెడుతున్నారు. ప్రతి ఏడాది వైకుంఠ ఏకాదశి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి గరుడ వాహనంపై స్వామిని ఊరేగిస్తారు. సోమవారం ఉదయం 7 గంటలకు గరుడసేవ నిర్వహిస్తామని సర్పంచ్ నిర్మల డింపుల్ తెలిపారు. బుగ్గకాశీవిశ్వేశ్వర ఆలయంలోనూ వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఆలయ అన్నదాన సమాజ కమిటీ వార్షికోత్సవ సంబరాలు కూడా ఇక్కడ జరగనున్నాయి.

హోమ్‌ట్రయాంగిల్ యాప్‌ను వినియోగించుకోండి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నగరి: హోమ్ ట్రయాంగిల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. ×ఒక కుటుంబం–ఒక వ్యాపార వేత్త, వాక్ టు వర్క్॥ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక మెప్మా కార్యాలయంలో పట్టణ బ్యూటీషియన్, సెలూన్ మెన్, కార్పెంటర్, ప్లంబర్ టీవీమెకానిక్, గీజర్ మెకానిక్, రిఫ్రిజిరేటర్ మెకానిక్, టీవీ రిపేరు వాషింగ్ మిషన్ రిపేరు, వాటర్ ప్యూరిఫికేషన్ వృత్తులపై ఆసక్తి ఉన్న వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ ద్వారా సేవలు అందిస్తూ చక్కని ఆదాయాన్ని పొందడానికి అవకాశం ఉందన్నారు. రాబోయే రోజులలో సర్వీస్ ఆన్‌లైన్ ద్వారా ప్రతి కుటుంబం అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. 100 మంది ఈ సమావేశానికి హాజరైతే అందులో 80 మందిని సర్వీస్ ప్రొవైడర్స్‌గా రిజిస్టర్ చేశారు. ప్రస్తుతం ఎన్‌రోల్మెంట్ చేసుకుపోయినా 17వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అని తెలియజేశారు. మున్సిపల్ అధికారులు ప్రసాద్, హేమశేఖర్, మెప్మా సిబ్బంది స్వరూప, హిమబిందు, లావణ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, పట్టణ సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

డైట్‌లో సంక్రాంతి సంబరాలు


భోగిమంటలు వేస్తున్న అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో ఛాత్రోపాధ్యాయుల సందడితో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. దీంతో డైట్ ఆవరణలో పండుగ వాతావరణాన్ని తలపించింది. సంక్రాంతిని పురస్కరించుకుని గురువారం ముందస్తుగా సంబరాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు డైట్ ఆవరణాన్ని మామిడి ఆకుల తోరణాలు, చెరకు గడలు, పూల దండలు, గాలిపటాలు, రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ సంక్రాంతి సంబరాల్లో పాల్గొని అధ్యాపకులకు ఛాత్రోపాధ్యాయులకు ప్రసాదాలను పంచిపెట్టి ఆనందంగా గడిపారు. పలురకాల ఆటలతో చూపరులను ఆకట్టుకున్నారు. అలాగే ఓ విద్యార్థిని ప్రిన్సిపల్‌కు సోది చెప్పడం మరింత ఆకట్టుకుంది. అదే విధంగా సంక్రాంతి సాంప్రదాయ ప్రకారం గోపూజ నిర్వహించారు. అధ్యాపకులు ప్రభాకర్, దేవప్రసాద్, చెంగల్‌రాజు, నిర్మల, సునీత, అనిత, మహ్మద్‌రఫీ, రెడ్డివెంకటరమణ, నాగరాజునాయక్, శ్రీనివాసులు రెడ్డి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న జేసీఐ సభ్యులు

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం గురువారం భూమి పూజ నిర్వహించారు. జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) చిత్తూరు గోల్డ్ శాఖ ఆర్థిక సాయంతో భవన నిర్మాణం చేపట్టారు. సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగంగా ఈ నిర్మాణం చేపట్టామని జేసీఐ అంతర్జాతీయ కమిషన్ చైర్మన్ ఎస్.బి హర్షవర్ధన్ రెడ్డి, జోన్ చైర్మన్ టి.భరత్, వైస్ చైర్మన్ కె.ప్రమోద్ పేర్కొన్నారు. సకాలంలో భవనం నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తామని చిత్తూరు చాప్టర్ అధ్యక్షుడు ఎం.వి.శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి చిరంజీవి పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ దుర్గాదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.శ్రీనివాసులు, సూపర్‌వైజర్ శైలజ, జేసీఐ చిత్తూరు చాప్టర్ మాజీ అధ్యక్షుడు జీకే మనోహర్, జీకే మానస తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి లక్ష్మికి ముందస్తు స్వాగతం


ముడిపల్లి జడ్పీహెచ్ఎస్ ఆవరణలో...


కళాశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


నెత్తం కండ్రిగలో సంక్రాంతి సంబరాలు

నగరి: మండలంలోని పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి పాఠశాలలకు సెలవులు ఉండడంతో ముందస్తుగా పాఠశాలలో సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. ముడిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు గ్రామ ప్రజాప్రతినిధులు సంప్రదాయ దుస్తులతో హాజరై సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా భోగి మంటల చుట్టూ విద్యార్థులు, ఉపాధ్యాయులు కోలాటాలు ఆడుతూ నృత్యాలు చేశారు. పాఠశాల ఆవరణలో పొంగళ్లు పెట్టి, చెరకు గెడలతో అలంకరించి సంక్రాంతి లక్ష్మికి ముందస్తు స్వాగతం పలికారు. ముగ్గుల పోటీలు నిర్వహించగా విద్యార్థినులు తమ ప్రతిభ చూపారు. ఉపాధ్యాయులు సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు.

విజయపురంలో..

మండలంలోని శ్రీహరిపురం ఉన్నత పాఠశాల, ఆలపాకం ప్రాథమికోన్నత పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భోగి మంటలు వేయడం, ఉట్టికొట్టడం ప్రత్యేకతను సంతరించుకుంది.

మున్సిపల్ పరిధి పరిధిలోని నెత్తం కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాల్లో ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి

వెదురుకుప్పం: చవటగుంటలోని డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాలలో సంక్రాంతి విశిష్టత ఉట్టిపడేలా కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో కళాశాల ప్రాంగణం అంతా రంగవల్లులతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ పూడి వెంకటేశ్వర్, సాంస్కృతిక కో–ఆర్డినేటర్ భీమమోహన్‌రావు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ మంగళగౌరి, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్కన్నగారిపల్లి పాఠశాలలో.

గంగాధరనెల్లూరు: మండలంలోని అక్కనగారి పల్లి ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ప్రధానోపాధ్యాయుడు ఆర్.గంగాధరం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేసి ప్రసాదాలు చేయించి పంచిపెట్టి ఘనంగా సంక్రాంతి వేడుకలను ముందస్తుగా నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఆపస్ యూనియన్‌తో జాతీయ భావజాలం


ఆపస్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న డైట్ ప్రిన్సిపల్ తదితరులు

కార్వేటినగరం: జాతీయ భావజాలం కలిగిన యూనియన్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘమని(ఆపస్) అని జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.శేఖర్ అన్నారు. గురువారం డైట్ ఆవరణలో ఆఫస్ యూనియన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన డైరీని సమాజ హితం, దేశ హితం కోసం పాటుపడిన పారిశ్రామికవేత్త రతన్ టాటా చిత్రపటంతో రూపొందించడం అభినందనీయమని తెలిపారు. ఆపస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు అన్ని రకాల ప్రమోషన్ల సాధనకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల అధ్యాపకులు నాగరాజునాయక్, రెడ్డి వెంకటరమణ, చంగల్రాజు, శ్రీనివాసులురెడ్డి, ప్రభాకర్‌రాజు, దేవప్రసాద్, సునీత, నిర్మల, అనిత, బోధనేతర సిబ్బంది కృపావతి, ఇలంగోవన్, శ్రీనివాసులు, ప్రసాద్, మదన్, శివ, వనజ పలువురు పాల్గొన్నారు